జూబ్లీహిల్స్‌లో శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26 నుంచి మార్చి 6వ తేదీ వరకు జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను టీటీడీ ఈవో జె.శ్యామలరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం అంకురార్పణ, బుధవారం ధ్వజారోహణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మార్చి 2న గరుడ వాహనం, 5న రథోత్సవం, 6న చక్రస్నానం నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆలయ ఆవరణలో చలువపందిళ్లు ఏర్పాటుచేసి అందంగా రంగవల్లులు తీర్చిదిద్దాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లతో ప్రతిభావంతులకు ప్రోత్సాహం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ కొలమానంగా అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందని, అర్హులైన ప్రతిభావంతులకు స్కాలర్ షిప్ అందిస్తున్నామని నయంత లీడర్‌షిప్ సభ్యులు ఎయిట్‌రోడ్స్ సంస్థ మాజీ ఫౌండర్ రాజ్ దుగ్గర్ తెలిపారు. టీహబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నయంత ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ రంజన్ బెనర్జీ మాట్లాడుతూ ఏప్రిల్ వరకు దరఖాస్తుల స్వీకరిస్తామని, ఆగస్టు నుంచి పుణేలో ఉన్న తాత్కాలిక యూనివర్సిటీలో తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. వర్సిటీ అడ్మిషన్స్ డీన్ ప్రొఫెసర్ పార్థసారథి మాట్లాడుతూ ప్రతిభావంతులకు అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఉంటుందన్నారు.


ఐఐటీహెచ్‌లో కంప్యూటేషనల్ కెమిస్ట్రీ కేంద్రాన్ని ప్రారంభించిన హైడెల్‌బర్గ్ యూనివర్సిటీ-ఐఐటీహెచ్ అధ్యాపక బృందం

హైదరాబాద్‌ను ఫార్మా హబ్‌గా మారుస్తాం

- టీఐఎఫ్ఆర్ డైరెక్టర్ కృష్ణమూర్తి
- ఐఐటీహెచ్‌తో హైడెల్‌బర్గ్ యూనివర్సిటీ భాగస్వామ్యం

కంది, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌ను ఫార్మా హబ్ గా మార్చి, విద్యార్థులకు ఆధునాతన రసాయన విద్యను అందిస్తామని టీఐఎఫ్ఆర్ (టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంట్ అండ్ రీసెర్చ్) హైదరాబాద్ కేంద్ర డైరెక్టర్ కృష్ణమూర్తి అన్నారు. ఇండో-జర్మన్ సహకారంతో కంప్యూటేషనల్ కెమిస్ట్రీపై పరిశోధనలు జరిపేందుకు సోమవారం సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌తో జర్మనీలోని హైడెల్‌బర్గ్ యూనివర్సిటీ భాగస్వామ్యమైంది. రసాయన పరిశోధన, విద్యా మార్పిడి, ఉపాధి, ఆవిష్కరణలు, సాంకేతికత బదిలీ కోసం ఐఐటీహెచ్‌లో ఐదు రోజుల పాటు ప్రత్యేక వర్క్‌షాప్ హబ్‌ను నిర్వహిస్తున్నారు. ఇందుకోసం హైడెల్‌బర్గ్ విశ్వవిద్యాలయ ఇద్దరు ఉపాధ్యక్షుల నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ప్రతినిధి బృందం ఈనెల 28 వరకు ఐఐటీహెచ్‌లో ఉంటూ ఇక్కడి విద్యా విధానాలు, పరిశోధనలపై అధ్యయనం చేయనున్నారు. ద్వైపాక్షిక- బహుపాక్షిక అకాడెమీ-ఇండస్ట్రీ భాగస్వామ్యాలను ప్రోత్సహించడం హబ్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఐఐటీహెచ్ అధికారులు వెల్లడించారు. ఆధునిక రసాయన శాస్త్రంలో విద్య, శిక్షణ, క్రాస్-కల్చరల్ లెర్నింగ్‌ను ప్రోత్సహించడం, మాస్టర్స్, గ్రాడ్యుయేట్ స్థాయిలలో దీర్ఘకాలిక ఇండో-జర్మన్ మార్పిడి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఒక ముఖ్య చొరవని ఐఐటీహెచ్ డీన్ నరహరిశాస్త్రీ తెలిపారు. రెండు విద్యా సంస్థల మధ్య స్థిరమైన శాస్త్రీయ, సాంకేతిక ఆర్థిక భాగస్వామ్యానికి మార్గం సుగమం చేస్తూ ఈ సహకారాన్ని నడిపించడంలో పరిశ్రమ, ప్రభుత్వ మద్దతు కీలకం ఆయన ఆకాంక్షించారు.

డిజిటల్ అరెస్టు కేసులో తమిళనాడుకు చెందిన ముగ్గురి అరెస్టు

- బాధితుడి నుంచి రూ.1.38 కోట్లు బదిలీ చేయించుకున్న ముఠా

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు పేరుతో డబ్బులు కొల్లగొట్టిన ఓ ముఠా సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు చిక్కింది. ఈ కేసులో ఈ నెల 21న తమిళనాడులోని నమక్కల్‌కు చెందిన గోకుల్ మారుతచాల మూర్తి (24), జాఫర్ షరీఫ్ (23), షారుఖాన్ (30)లను అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సైబర్ క్రైం పోలీసుల వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన బాధితుడికి ముఠాలోని ఒకరు ఫోన్ చేసి తాను ఎస్‌బీఐ ప్రతినిధినని చెప్పి.. మీపై యాంటీ మనీలాండరింగ్ కేసు నమోదైందన్నాడు. అదే సమయంలో వాట్సాప్ కాల్ ద్వారా ఫోన్ చేసి ముంబై క్రైం పోలీస్ ఆఫీసర్‌గా మాట్లాడి ఆయనను తీవ్ర భయాందోళనలకు గురి చేశాడు. బాధితుడి ఆధార్ కార్డును మనీలాండరింగ్ కార్యకలాపాలకు వాడుకున్నట్లు తేలిందని బెదిరించారు. ఈ నేపథ్యంలో బాధితుడు వారికి రూ.1,38,60,000 వివిధ బ్యాంకుల నుంచి బదిలీ చేశాడు. ఆ తర్వాత మోసపోయానని గుర్తించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టారు. బాధితుడు బదిలీ చేసిన నగదులో రూ.9.60లక్షలు గోకుల్ మారుతచాల మూర్తికి చెందిన ఫెడరల్ బ్యాంకు అకౌంట్‌కు వెళ్లినట్టు గుర్తించారు. ఈ డబ్బులను రాహుల్ అనే వ్యక్తి బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసుకున్నాడు. గోకుల్ తన బ్యాంకు అకౌంట్ వివరాలు, పాస్‌బుక్, ఏటీఎం కార్డు, చెక్‌బుక్‌లను జాఫర్ షరీఫ్, షారుఖాన్‌లకు కమీషన్ మీద ఇచ్చాడు. వీరంతా కలిసి ముఠాగా ఏర్పడి బాధితుడి నుంచి డబ్బులు బదిలీ చేయించుకొన్నారు. ముఠా సభ్యులు వాట్సాప్, టెలిగ్రామ్ యాప్‌లను వాడుతూ తాము పోలీసు అధికారులమని చెప్పి మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

రంగారెడ్డి జిల్లా కోర్టు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో వంచించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రంగారెడ్డి 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పీపీ మంజులాదేవి కథనం ప్రకారం.. కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పులిమామిడికి చెందిన తిమ్మగళ్ల శ్రీనాథ్ (21) ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని ఓ బాలికను నమ్మించాడు. మాయమాటలు చెప్పి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత పెళ్లి చేసుకోకుండా తిరస్కరించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదుచేసింది. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండుకు తరలించారు. కేసు పూర్వాపరాలను విచారించిన 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎమ్.వాణి నిందితుడు శ్రీనాథ్‌ను దోషిగా నిర్ధారిస్తూ 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేలు జరిమానా విధించారు. బాధితురాలికి రూ.3లక్షల నష్ట పరిహారం చెల్లించాల్సిందిగా తీర్పు వెల్లడించారు.

విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి

- రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

రాంనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాంచాలని, సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతానని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో 'రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15శాతం నిధులు కేటాయించాలని' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్య పరిరక్షణకు ఉద్యమించాలని కోరారు. రాజ్యాంగం ద్వారా విద్యా హక్కులను కల్పించకపోతే దళితులు చదువుకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, మనువాద భావజాలాల వల్ల విద్యకు బడ్జెట్ కేటాయింపులో అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఎంవీ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి ఆర్ వెంకట్‌రెడ్డి, బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 15 శాతం నిధులు కేటాయించాలన్నారు. బడ్జెట్ కేవలం 7 శాతం నిధులు కేటాయించి అన్యాయం చేశారన్నారు.

ఎట్టకేలకు డిగ్రీ కళాశాలకు మోక్షం..!

కూకట్‌పల్లి ప్రభుత్వ కళాశాలకు పక్కా భవనం

- రూ.4.95 కోట్ల నిధులతో జీ ప్లస్ వన్ భవనానికి చురుగ్గా పనులు
- 2008లో కళాశాల మంజూరు.. 2025-26 అందుబాటులోకి


డిగ్రీ కళాశాల కోసం నిర్మాణంలో ఉన్న కొత్త భవనం ఇదే

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అరకొర వసతులతో నెట్టుకొస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పక్కా భవనం అందుబాటులోకి రానుంది. కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2008లో మంజూరైంది. డిగ్రీ కళాశాలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే నడపాలని సర్కారు ఆదేశాల మేరకు 240 మందికి అడ్మిషన్లు ఇవ్వగా 32 మందే జాయిన్ అయ్యారు. ప్రస్తుతం ఉదయం జూనియర్ కళాశాల నడుస్తుండగా.. అదే భవనంలో మధ్యాహ్నం డిగ్రీ కళాశాలను నిర్వహిస్తున్నారు. పక్కా భవన నిర్మాణం కోసం 2017-18లో రూ.50లక్షలతో పునాది పడింది. తాజాగా పీఎం ఉషా (ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్) స్కీం కింద జీ ప్లస్ వన్ భవనానికి రూ.5కోట్లు మంజూరు కాగా రూ.5లక్షలు డిజిటల్ క్లాస్‌రూంకు ఉపయోగించుకుంటుండటంతో రూ.4.95 కోట్లతో భవనం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ కళాశాల అందుబాటులోకి రానుంది.

దోస్త్ ద్వారా సీట్లన్నీ ఫుల్

2016-17లో దోస్త్ ద్వారా ఫస్ట్ ఇయర్‌లో 340 మందికి, తాజాగా 2024-25లో 840 మందికి అడ్మిషన్లు కల్పించారు. ప్రస్తుతం కూకట్‌పల్లి డిగ్రీ కళాశాలలో 1,893 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పక్కా భవనం అవసరం ఉందని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిస్తుండగా.. 2016లో రూ.2.75 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని ప్రకటించి రూ.50లక్షలు విడుదల చేశారు. దీంతో 2017-18లో కళాశాల పక్కా భవనం నిర్మాణం కోసం పునాది పడింది. తాజాగా పీఎం ఉషా కింద నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న భవనం ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో ఉండగా.. డిగ్రీ కళాశాల కోసం 2.06 గుంటలు అధికారికంగా కేటాయించారు. ప్రస్తుతం గ్రౌండ్‌లో ఎనిమిది, ఫస్ట్ ఫ్లోర్‌లో ఎనిమిది చొప్పున గదుల నిర్మాణం జరుగుతుంది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జీ ప్లస్ 4 అవసరం ఉంటుందని లెక్చరర్స్ చెబుతున్నారు. కళాశాల మంజూరు సమయంలో బీఏ, బీకాం మాత్రమే ఉండేవి. ప్రస్తుతం బీఏ, బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ (లైఫ్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్), 2024-25 నుంచి బీబీఏ (బ్యాచ్‌లర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) కోర్సును కూడా ప్రవేశపెట్టారు. ఉన్నత విద్య కోసం, అలాగే ఉపాధి అవకాశాలున్న కోర్సులు ఉండటంతో పేద, దిగువ, మధ్య తరగతి కుటుంబాల పిల్లలు ఇక్కడే చదువుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కొత్తగా నిర్మాణంలో ఉన్న భవనం 2025-26 అకడమిక్ ఇయర్‌లో అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు.

వసతి గృహాల కోసం రూ.10కోట్లు

కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకునే వారు పేద వర్గాలకు చెందిన వారే. వీరంతా దోస్త్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల నుంచి ఇక్కడ చదువుకునేందుకు అడ్మిషన్లు తీసుకుంటున్నారు. కొందరు నగరంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ బస్‌పాస్ ద్వారా కళాశాలలో చదువుకుంటున్నారు. దీన్ని గమనించి హాస్టల్స్ అవసరమని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌కు రూ.10 కోట్లతో నిర్మించాలని నివేదించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కూకట్‌పల్లి ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలు లేకపోతే కుత్బుల్లాపూర్ అయినా పర్వాలేదు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు వసతి గృహాలుంటే ఇంకా ఎక్కువ మంది చదువుకునేందుకు ముందుకు వస్తారని చెబుతున్నారు. ప్రాధాన్య క్రమంలో తొలుత బాలికలకయినా వసతి కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కొత్త భవనంతో కొంతవరకు ఉపశమనమే

మాకు పూర్తిస్థాయిలో కళాశాల జరగాలి. ఉంటే కోర్సులకు తగ్గట్లు తరగతి గదులు ఉండాలి. ప్రస్తుతం నిర్మించే భవనం మాకు ఎప్పటిలాగే ఉదయం కొన్ని కోర్సులు, సాయంత్రం మరికొన్నింటిని నిర్వహించాల్సిందే. ఏటేటా విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. భవిష్యత్తులో మరొక రెండు అంతస్తుల నిర్మాణం కోసం పునాది వేశారు. ఒకే భవనంలో రెండు కళాశాలలు కాకుండా ఇది డిగ్రీ కళాశాల అనేలా కొత్త భవనం నిర్మాణం జరుగుతుంది. ప్రభుత్వం ఇక్కడి విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని కనీసం మరొక అంతస్తు నిర్మిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. - అలివేలు మంగమ్మ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, కూకట్‌పల్లి

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. మేడ్చల్-మల్కాజిగిరి బీఆర్ఎస్ కంటెస్టెడ్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి కూకట్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్లు, ఏ ప్రతిపాదికన ఇస్తారో వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విధివిధానాలు ప్రకటించకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని 9 డివిజన్‌లకు ప్రభుత్వం14 నెలల్లో కేవలం రూ.6 కోట్లు కేటాయించారని, బీఆర్ఎస్ హయాంలో నెలకు సుమారు రూ.30 కోట్లు ఖర్చుచేశామని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో నిర్మించిన బ్రిడ్జిలకు రంగులు వేసి వాటిని తామే నిర్మించామని గొప్పలు చెప్పుకోవటం సిగ్గుచేటని విమర్శించారు.

పోచమ్మ ఆలయంలో పూజలు

కూకట్‌పల్లి పోచమ్మతల్లి దేవాలయ 2వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ఎమ్మెల్యే మాధవరం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయకమిటీసభ్యులు ఆయనకు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణరావు, మాజీ కార్పొరేటర్ రంగారావు, చిన్న తులసి, సూర్యారావు, వెంగళరావు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ రంగారావు

మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శ

ఎమ్మెల్యే మాధవరం అభిమాని చిన్నపూమాల అబ్బాయి ఇటీవలే ప్రమాదవశాత్తు మృతిచెందడంతో ఎమ్మెల్యే వారి కుటుంబసభ్యలను పరామర్శించారు. చిన్న వయసులోనే ఇలా జరగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు

కూకట్‌పల్లి బాలానగర్ డివిజన్ గిరిసాగర్‌రాజు ఆధ్వర్యంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బాలానగర్ కాంగ్రెస్ నాయకులు గులాబీ కండువా కప్పుకుని బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కో-ఆర్డినేటర్ సతీష్ అరోరా, విష్ణు, బాలానగర్‌కు మధు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ గ్లాసుల తయారీకి అనుమతులు ఉన్నాయా..?

- అగ్నిప్రమాదంపై కొనసాగుతున్న విచారణ
- పత్తాలేని యజమాని


కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లో దగ్ధమైన ప్లాస్టిక్ గ్లాసుల పరిశ్రమ

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రశాంత్ నగర్ పారిశ్రామిక వాడలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ప్లాస్టిక్ గ్లాసుల పరిశ్రమ పూర్తిగా దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా చెలరేగిన మంటలతో భవనానికి సంబంధించిన విద్యుత్‌వైర్లు దెబ్బతిన్నాయి. సంఘటన జరిగి 16గంటలు గడిచినా పరిశ్రమకు సంబంధించిన యజమాని జాడ మాత్రం ఎక్కడా కనిపించలేదని అధికారులు తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఇనిస్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి శ్రీధర్ వివరాలు సేకరించి, యాజమానిపై ఆరా తీశారు. అగ్నిమాపకదళ అధికారులు.. పోలీసు అధికారులతో మాట్లాడి పరిశ్రమ దగ్ధంపై వివరాలు తీసుకున్నారు.

10 మందికిపైగా సిబ్బంది ఉంటే పరిశ్రమ అనుమతి తప్పనిసరి

కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్ ప్లాస్టిక్ గ్లాసుల పరిశ్రమను సందర్శించిన పరిశ్రమల అధికారి శ్రీధర్ మాట్లాడుతూ, పరిశ్రమలో 10 మందికి పైగా సిబ్బంది ఉన్నట్లయితే తప్పనిసరిగా పరిశ్రమకు అనుమతులు తీసుకోవాలని అన్నారు.

అనుమతులు లేకుండానే నడుస్తున్న పరిశ్రమ

షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోయిన పరిశ్రమలో సుమారు 26 మందికి పైగా సిబ్బంది పనిచేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు అందులో సిబ్బంది లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాని అదే సమయంలో అందులో సిబ్బంది పనిచేస్తూ ఉంటే మాత్రం సిబ్బంది కూడా మంటలో మాడి మసైపోయేవారిని స్థానికులు పరిశ్రమ యాజమానిపై మండిపడ్డారు. అగ్నిమాపకదళ సిబ్బంది కూడా యజమాని జాడకోసం ఆరా తీస్తున్నారు. మరోవైపు విద్యుత్ అధికారులు తెగిపడిన వైర్లను తొలగించి మరమ్మతులను చేపట్టారు.

ఆరుగురు జూదరుల అరెస్టు


పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

హైదర్‌నగర్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై పోలీసుల దాడులు చేసి ఆరుగురు పేకాట రాయుళ్లను ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. ధర్మారెడ్డికాలనీలో ఓ ఇంట్లో రహస్యంగా పేకాట ఆడుతున్నారనే సమాచారం ఎస్‌ఓటీ పోలీసులకు అందింది. ఆమేరకు దాడులు చేసి ఆరుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.51,320, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతర విచారణ నిమిత్తం కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు


అల్లాపూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లోని నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ రాకేష్‌గౌడ్ తెలిపారు. వేసవికాలం దృష్ట్యా లైన్ క్లియర్, ఏ.బి. స్విచ్ ఎరక్షన్ పనుల కారణంగా విద్యుత్ కోత ఉండనుందని ఆయన పేర్కొన్నారు. 11 కేవీ గాయత్రీనగర్ ఫీడర్ ఎమనేటింగ్ ఫ్రం బోరబండ ఎస్.ఎస్ పరిధిలోని వివేకానందనగర్, పర్వత్‌నగర్, గవర్నమెంట్ హాస్పిటల్ పరిసరాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు. 11 కేవీ అల్లాపూర్ ఫీడర్ పరిధిలోని గాయత్రీనగర్, జ్యోతినగర్, చంద్రగార్డెన్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తారు.

'ఎమ్మెల్యే ఆటలు సాగనివ్వం'


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బాలానగర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మాయమాటలు చెబుతూ ప్రజలను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మోసగిస్తున్నారని ఆయన ఆటలు ఇంకా సాగనీయకుండా ప్రజలను మేల్కొలిపే కార్యక్రమాలను చేపడతామని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం కాంగ్రెస్ తీరుపై ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించారు. కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండిరమేష్ సూచనల మేరకు బాలానగర్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, ఉపాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు మధూగౌడ్, సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ లక్ష్మయ్య మాట్లాడారు. సోమవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నుంచి వందల మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారని చెప్పారని, ఇందులో వాస్తవం అన్నారు. నలుగురు మాత్రమే గులాబీ కండువా కప్పుకున్నారని స్పష్టం చేశారు. ఇప్పటికైనా తమ పార్టీపై బురదచల్లే ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించారు.

మాధవరం కాంతారావు ప్రత్యేక పూజలు


పూజల్లో బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి కాంతారావు, నాయకులు

బాలానగర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలానగర్ డివిజన్ కల్యాణ్‌నగర్ ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. కమిటీ సభ్యులు.. కాంతారావును సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి కొత్తూరు రమేష్, డివిజన్ మాజీ అధ్యక్షుడు రమేష్, డివిజన్ అధ్యక్షుడు డా. కిరణ్ బాలాజీనగర్ నాయకుడు గోపి, ప్రధానకార్యదర్శి వెంకటసేనారెడ్డి, దర్శన్ పాల్గొన్నారు.

ప్రజావాణికి 18 ఫిర్యాదులు


ప్రజావాణి కార్యక్రమంలో జెడ్సీ అపూర్వ్ చౌహాన్


కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 18 ఫిర్యాదులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్, ట్యాక్స్, ఎలక్ట్రికల్, వెటర్నరీ విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించిన జెడ్సీ అపూర్వ్ చౌహాన్ త్వరితగతిన ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. ఒకే సమస్యపై పదేపదే ఫిర్యాదులు ఎందుకు వస్తున్నాయో? క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. ఆమేరకు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

శంభో స్వయంభో.. అహోరాత్ర అభిషేకాలు


కైత్లాపూర్ గ్రౌండ్స్‌లో మహాశివరాత్రి ఏర్పాట్లను కృష్ణచాముండేశ్వర మహర్షితో కలిసి ప్రారంభిస్తున్న మూసాపేట కార్పొరేటర్ మహేందర్

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బుధవారం మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని కైత్లాపూర్ గ్రౌండ్స్‌లో శంభో.. స్వయంభో.. అహోరాత్ర అభిషేకాలు నిర్వహిస్తున్నామని శ్రీచాముండేశ్వర పీఠాధిపతి శ్రీకృష్ణ చాముండేశ్వర మహర్షి అన్నారు. సోమవారం కైత్లాపూర్ గ్రౌండ్స్‌లో కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్‌తో కలిసి శివరాత్రి వేడుకల పనులను ప్రారంభించారు. శివరాత్రి రోజు సాయంత్రం 6గంటలనుంచి గురువారం ఉదయం 6గంటల వరకు అహోరాత్ర అభిషేకాలు.. సాలగ్రామ రుద్రాభిషేకాలు నిర్వహిస్తామని భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబురావు, బీజేపీ నాయకులు స్వామి, మల్లేశ్‌గౌడ్, శేఖర్‌గుప్తా, రవిగౌడ్, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరిస్తాం


మైత్రీవనం కాలనీలో కార్పొరేటర్ నర్సింహయాదవ్

ఓల్డుబోయినపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఏ కష్టం వచ్చిన రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఓల్డుబోయినపల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ డివిజన్ ప్రజలకు హామీ ఇచ్చారు. సోమవారం ఉదయం డివిజన్ పరిధిలోని మైత్రీవనం కాలనీ, రామ్‌రెడ్డి కాలనీ, నాగిరెడ్డి కాలనీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరించాలని బస్తీవాసులు వినతి పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో జగన్ రెడ్డి, సాగర్, హనుమంతరావు, మహేష్, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26 నుంచి మార్చి 6వ తేదీ వరకు జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను టీటీడీ ఈవో జె.శ్యామలరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం అంకురార్పణ, బుధవారం ధ్వజారోహణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మార్చి 2న గరుడ వాహనం, 5న రథోత్సవం, 6న చక్రస్నానం నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆలయ ఆవరణలో చలువపందిళ్లు ఏర్పాటుచేసి అందంగా రంగవల్లులు తీర్చిదిద్దాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లతో ప్రతిభావంతులకు ప్రోత్సాహం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ కొలమానంగా అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందని, అర్హులైన ప్రతిభావంతులకు స్కాలర్ షిప్ అందిస్తున్నామని నయంత లీడర్‌షిప్ సభ్యులు ఎయిట్‌రోడ్స్ సంస్థ మాజీ ఫౌండర్ రాజ్ దుగ్గర్ తెలిపారు. టీహబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నయంత ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ రంజన్ బెనర్జీ మాట్లాడుతూ ఏప్రిల్ వరకు దరఖాస్తుల స్వీకరిస్తామని, ఆగస్టు నుంచి పుణేలో ఉన్న తాత్కాలిక యూనివర్సిటీలో తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. వర్సిటీ అడ్మిషన్స్ డీన్ ప్రొఫెసర్ పార్థసారథి మాట్లాడుతూ ప్రతిభావంతులకు అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఉంటుందన్నారు.



ఐఐటీహెచ్‌లో కంప్యూటేషనల్ కెమిస్ట్రీ కేంద్రాన్ని ప్రారంభించిన హైడెల్‌బర్గ్ యూనివర్సిటీ-ఐఐటీహెచ్ అధ్యాపక బృందం

హైదరాబాద్‌ను ఫార్మా హబ్‌గా మారుస్తాం

- టీఐఎఫ్ఆర్ డైరెక్టర్ కృష్ణమూర్తి
- ఐఐటీహెచ్‌తో హైడెల్‌బర్గ్ యూనివర్సిటీ భాగస్వామ్యం

కంది, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌ను ఫార్మా హబ్ గా మార్చి, విద్యార్థులకు ఆధునాతన రసాయన విద్యను అందిస్తామని టీఐఎఫ్ఆర్ (టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంట్ అండ్ రీసెర్చ్) హైదరాబాద్ కేంద్ర డైరెక్టర్ కృష్ణమూర్తి అన్నారు. ఇండో-జర్మన్ సహకారంతో కంప్యూటేషనల్ కెమిస్ట్రీపై పరిశోధనలు జరిపేందుకు సోమవారం సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌తో జర్మనీలోని హైడెల్‌బర్గ్ యూనివర్సిటీ భాగస్వామ్యమైంది. రసాయన పరిశోధన, విద్యా మార్పిడి, ఉపాధి, ఆవిష్కరణలు, సాంకేతికత బదిలీ కోసం ఐఐటీహెచ్‌లో ఐదు రోజుల పాటు ప్రత్యేక వర్క్‌షాప్ హబ్‌ను నిర్వహిస్తున్నారు. ఇందుకోసం హైడెల్‌బర్గ్ విశ్వవిద్యాలయ ఇద్దరు ఉపాధ్యక్షుల నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ప్రతినిధి బృందం ఈనెల 28 వరకు ఐఐటీహెచ్‌లో ఉంటూ ఇక్కడి విద్యా విధానాలు, పరిశోధనలపై అధ్యయనం చేయనున్నారు. ద్వైపాక్షిక- బహుపాక్షిక అకాడెమీ-ఇండస్ట్రీ భాగస్వామ్యాలను ప్రోత్సహించడం హబ్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఐఐటీహెచ్ అధికారులు వెల్లడించారు. ఆధునిక రసాయన శాస్త్రంలో విద్య, శిక్షణ, క్రాస్-కల్చరల్ లెర్నింగ్‌ను ప్రోత్సహించడం, మాస్టర్స్, గ్రాడ్యుయేట్ స్థాయిలలో దీర్ఘకాలిక ఇండో-జర్మన్ మార్పిడి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఒక ముఖ్య చొరవని ఐఐటీహెచ్ డీన్ నరహరిశాస్త్రీ తెలిపారు. రెండు విద్యా సంస్థల మధ్య స్థిరమైన శాస్త్రీయ, సాంకేతిక ఆర్థిక భాగస్వామ్యానికి మార్గం సుగమం చేస్తూ ఈ సహకారాన్ని నడిపించడంలో పరిశ్రమ, ప్రభుత్వ మద్దతు కీలకం ఆయన ఆకాంక్షించారు.

డిజిటల్ అరెస్టు కేసులో తమిళనాడుకు చెందిన ముగ్గురి అరెస్టు

- బాధితుడి నుంచి రూ.1.38 కోట్లు బదిలీ చేయించుకున్న ముఠా

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు పేరుతో డబ్బులు కొల్లగొట్టిన ఓ ముఠా సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు చిక్కింది. ఈ కేసులో ఈ నెల 21న తమిళనాడులోని నమక్కల్‌కు చెందిన గోకుల్ మారుతచాల మూర్తి (24), జాఫర్ షరీఫ్ (23), షారుఖాన్ (30)లను అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సైబర్ క్రైం పోలీసుల వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన బాధితుడికి ముఠాలోని ఒకరు ఫోన్ చేసి తాను ఎస్‌బీఐ ప్రతినిధినని చెప్పి.. మీపై యాంటీ మనీలాండరింగ్ కేసు నమోదైందన్నాడు. అదే సమయంలో వాట్సాప్ కాల్ ద్వారా ఫోన్ చేసి ముంబై క్రైం పోలీస్ ఆఫీసర్‌గా మాట్లాడి ఆయనను తీవ్ర భయాందోళనలకు గురి చేశాడు. బాధితుడి ఆధార్ కార్డును మనీలాండరింగ్ కార్యకలాపాలకు వాడుకున్నట్లు తేలిందని బెదిరించారు. ఈ నేపథ్యంలో బాధితుడు వారికి రూ.1,38,60,000 వివిధ బ్యాంకుల నుంచి బదిలీ చేశాడు. ఆ తర్వాత మోసపోయానని గుర్తించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టారు. బాధితుడు బదిలీ చేసిన నగదులో రూ.9.60లక్షలు గోకుల్ మారుతచాల మూర్తికి చెందిన ఫెడరల్ బ్యాంకు అకౌంట్‌కు వెళ్లినట్టు గుర్తించారు. ఈ డబ్బులను రాహుల్ అనే వ్యక్తి బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసుకున్నాడు. గోకుల్ తన బ్యాంకు అకౌంట్ వివరాలు, పాస్‌బుక్, ఏటీఎం కార్డు, చెక్‌బుక్‌లను జాఫర్ షరీఫ్, షారుఖాన్‌లకు కమీషన్ మీద ఇచ్చాడు. వీరంతా కలిసి ముఠాగా ఏర్పడి బాధితుడి నుంచి డబ్బులు బదిలీ చేయించుకొన్నారు. ముఠా సభ్యులు వాట్సాప్, టెలిగ్రామ్ యాప్‌లను వాడుతూ తాము పోలీసు అధికారులమని చెప్పి మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

రంగారెడ్డి జిల్లా కోర్టు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో వంచించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రంగారెడ్డి 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పీపీ మంజులాదేవి కథనం ప్రకారం.. కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పులిమామిడికి చెందిన తిమ్మగళ్ల శ్రీనాథ్ (21) ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని ఓ బాలికను నమ్మించాడు. మాయమాటలు చెప్పి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత పెళ్లి చేసుకోకుండా తిరస్కరించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదుచేసింది. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండుకు తరలించారు. కేసు పూర్వాపరాలను విచారించిన 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎమ్.వాణి నిందితుడు శ్రీనాథ్‌ను దోషిగా నిర్ధారిస్తూ 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేలు జరిమానా విధించారు. బాధితురాలికి రూ.3లక్షల నష్ట పరిహారం చెల్లించాల్సిందిగా తీర్పు వెల్లడించారు.

విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి

- రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

రాంనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాంచాలని, సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతానని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో 'రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15శాతం నిధులు కేటాయించాలని' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్య పరిరక్షణకు ఉద్యమించాలని కోరారు. రాజ్యాంగం ద్వారా విద్యా హక్కులను కల్పించకపోతే దళితులు చదువుకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ కె.లక్ష్మినారాయణ మాట్లాడుతూ, మనువాద భావజాలాల వల్ల విద్యకు బడ్జెట్ కేటాయింపులో అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఎంవీ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి ఆర్ వెంకట్‌రెడ్డి, బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 15 శాతం నిధులు కేటాయించాలన్నారు. బడ్జెట్ కేవలం 7 శాతం నిధులు కేటాయించి అన్యాయం చేశారన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణం.. కొలిక్కి వచ్చేనా..?



కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ (ఫైల్)

- కోర్టు వివాదంతో ఎంఐజీ కాలనీలో నిలిచిపోయిన పనులు
- స్టేతో అర్ధంతరంగా ఆగిన నిర్మాణం
- మరో పక్క వివాద స్థలంలో జోరుగా అక్రమ నిర్మాణాలు

ఖేల్‌కాలనీ, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వసతులు అందించాలనే ఉద్దేశంతో ప్రారంభిస్తున్న అభివృద్ధి పనులు వివాదాల్లో చిక్కుకుని మధ్యలోనే ఆగిపోతున్నాయి. మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండాలనే సంకల్పంతో నిర్మిస్తున్న నిర్మాణాలు నిలిచిపోవడంతో నిధులు మరుగున పడిపోతున్నాయి. దీంతోపాటు అందరికీ అందుబాటులో ఓ భవనం ఉండాలనే స్థానికుల ఆశ కలగా మిగిలిపోయింది. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో గల భారతీనగర్ డివిజన్‌లో ఓ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని స్థానికులు డివిజన్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి, నియోజక వర్గ ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీకి పలుమార్లు విన్నవించారు. అందరికీ అందుబాటులో ఉండే ప్రాంతంలో నిర్మాణం చేపట్టాలని కోరడంతో ఎట్టకేలకు కాలనీలో గలఫోర్త్‌ఫేజ్ వద్దనున్న పోచమ్మతల్లి ఆలయం వెనుక గల ప్రభుత్వ ఖాళీ ప్రదేశంలో నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు ప్రతిపాదనలు పూర్తిచేయగా, రూ.40 లక్షల వ్యయంతో ప్రత్యేక నిధులు సైతం మంజూరయ్యాయి. దీంతో 2023 సెప్టెంబరు 28న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ఎంఐజీకాలనీలోని పోచమ్మ తల్లి దేవాలయం వెనుక రూ.40లక్షల సీడీఎస్ నిధులతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు డివిజన్ కార్పొరేటర్ సింధూ, శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్, దేవాలయ పోషకులు మోహన్‌గౌడ్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. కాగా ఇక్కడ నిర్మాణంపై మొదటి నుంచి అభ్యంతరం వ్యక్తంచేసిన ఓ వర్గం, దీనిపై కోర్టుకెళ్లింది. శ్మశానవాటికకు కేటాయించిన స్థలంలో నిర్మాణం చేపడుతున్నారంటూ ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారుల పేర్లను చేరుస్తూ కోర్టులో వ్యాజ్యం దాఖలవడంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని కోర్టు స్టే విధించింది. దీనిపై అధికారులు వివరణ ఇస్తూ సర్వే నెంబరు ఒక్కటైనప్పటికీ ఈ స్థలం శ్మశానవాటికకుసంబంధించినది కాదని పేర్కొన్నారు. శ్మశానవాటికకు 2.16 ఎకరాలు కేటాయించి, ప్రహరీ నిర్మాణం చేపట్టామని, మిగిలిన ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపడుతున్నామని కోర్టుకు తెలిపారు. మరోపక్క పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్మాణం ప్రారంభించి సగం వరకు పూర్తిచేశారు. అయితే నిర్మాణాలు చేపట్టవద్దని స్టే విధించడంతో మధ్యలోనే నిర్మాణం ఆగిపోయింది.

స్టే ఉన్నా.. జోరుగా నిర్మాణాలు



సగం నిర్మాణంలో నిలిచిపోయిన కమ్యూనిటీ హాల్ నిర్మాణం

కమ్యూనిటీ హాల్ వెనుక కొంతమేరకు కాలనీ సొసైటీ పలువురికి కేటాయించింది. సొసైటీలో పనిచేసిన సిబ్బంది సేవలకు గుర్తింపుగా ప్రతీ ఒక్కరికి 80 గజాల స్థలాన్ని నామమాత్రపు రుసుముతో సొసైటీ కేటాయించగా పలువురు షెడ్డులను నిర్మించుకుని నివసిస్తున్నారు. అయితే సిబ్బందికి కేటాయించిన స్థలాల్లో మిగిలిన భూమిని గతంలోనే సొసైటీ డైరెక్టర్లు, ప్రైవేటు వ్యక్తులు విక్రయించారు. దీనిని వ్యతిరేకిస్తూ పలువురు సొసైటీ సభ్యులు కోర్టును ఆశ్రయించగా ఈ విషయం ఇప్పటికీ కోర్టు పరిధిలోనే ఉంది. మరోపక్క కోర్టు స్టే ఉన్నా ఇదే ప్రాంతంలో జోరుగా నిర్మాణాలు జరుగుతున్నాయి.

శ్మశానవాటికతో కమ్యూనిటీ హాల్ స్థలానికి సంబంధం లేదు



స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు చేస్తున్న పనుల వల్లే అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయి. పోచమ్మతల్లి దేవాలయం వెనుక నిర్మించ తలపెట్టిన కమ్యూనిటీ హాల్ స్థలానికి శ్మశానవాటిక స్థలంతో సంబంధం లేదు. దశాబ్దాల క్రితమే దీనికి స్థలాన్ని కేటాయించి ప్రహరీ నిర్మించారు. మిగిలిన ప్రభుత్వ భూమిలోనే పోచమ్మ తల్లి ఆలయం ఉంది. ఇదే ప్రాంతలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని పనులు ప్రారంభించింది. సొసైటీ డైరెక్టర్ల నడుమ విభేదాలతో జరుగుతున్న పనులకు అడ్డుతగులుతున్నారు.

- జి.మోహన్‌గౌడ్, పోచమ్మతల్లి దేవాలయ చైర్మన్, మాజీ కౌన్సిలర్

త్వరలోనే పనులు ప్రారంభం



నిర్మాణ విషయం కోర్టు పరిధిలో ఉంది. జీహెచ్ఎంసీ అందుకు తగ్గట్టుగా చర్యలు తీసుకుంటోంది. సాంకేతిక కారణాల వల్ల నిర్మాణం ఆలస్యమైంది. నిర్మాణం కోసం కేటాయించిన నిధులు ఇంకా అలాగే ఉన్నాయి. త్వరలోనే పనులు ప్రారంభించి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకువస్తాం. అభివృద్ధి పనులకు కాలనీవాసులు సహకరించాలి.

- సింధూ ఆదర్శ్‌రెడ్డి, డివిజన్ కార్పొరేటర్, భారతీనగర్

మహిళను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన ఇద్దరి అరెస్టు



మియాపూర్ పీఎస్‌లో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్

మియాపూర్, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని ఓ వివాహితను ఇద్దరు యువకులు కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన నిందితులను మియాపూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుండి ఆక్టీవతో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ వై.శ్రీనివాస్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ వెల్లడించారు. వివరాల ప్రకారం.. శాంతినగర్ ప్రాంతానికి చెందిన బాలకుమార్ (25) డ్రైవర్. మెదక్ ప్రాంతంలో అల్లాదుర్గంలోని గుడిపెద్ద ప్రాంతానికి చెందిన మహేష్ (24) పెయింటర్. వీరిద్దరు స్నేహితులు. ఇద్దరు గతంలో స్నాచింగ్, దొంగతనం కేసుల్లో పాత నేరస్తులు. ఈనెల 21న రాత్రి క్యాబ్‌డ్రైవర్ 100కు డయల్ చేసి మియాపూర్ చౌరస్తాలో ఓ మహిళను కిడ్నాప్ చేసి తీసుకువెళ్తున్నారని సమాచారం అందించారు. దీంతో స్పందించిన పోలీసులు అప్పటికే అక్కడ మహిళ లేకపోవడం, వారు కనిపించక పోవడంతో ప్రత్యేక టీంతో కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు. అయితే పోలీసులు ఐడీఏబొల్లారం ప్రాంతాల్లో ఆ యువతిని మూడు గంటల్లోనే గుర్తించారు. ఆమె ఏమి చెప్పలేకపోవడంతో ఆస్పత్రికి తరలించారు. వైద్యపరీక్షల్లో అత్యాచారానికి గురైనట్లు ధృవీకరించడంతో అత్యాచారం, కిడ్నాప్ కేసు నమోదు చేశారు. ఇద్దరు వ్యక్తులపై ఆరాతీసిన పోలీసులు ఐలాపురం తండా వద్ద వారిని పట్టుకుని విచారించగా, నేరం అంగీకరించడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

యువకుడి హత్య కేసును చేధించిన పోలీసులు

ముగ్గురు నిందితుల అరెస్టు.. పరారీలో మరో ఇద్దరు

మియాపూర్, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): చెల్లిపెళ్లి ఆగిపోవడానికి చేతబడి చేయించాడని.. తమకుటుంబం అనారోగ్యం పాలుకావడానికి కారణమయ్యాడని స్నేహితుడిపై అనుమానంతో మరో నలుగురితో కలిసి చెరువు వద్దకు తీసుకువెళ్లి కర్రతో చితకబాది హత్య చేసిన ఐదుగురిని గుర్తించారు. వారిలో ముగ్గురిని అరెస్టు చేసి ఓ వాహనం, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఏసీపీ వై.శ్రీనివాస్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి వివరాలను వెల్లడించారు. చందానగర్ పాపిరెడ్డికాలనీకి చెందిన నజీర్ (41) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇదే ప్రాంతం నెహ్రూనగర్‌కు చెందిన ప్రక్రుద్దీన్ ఎలక్ట్రిషన్‌గా పనిచేస్తున్నాడు. ఇదేప్రాంతంలో సారా ఎన్‌క్లేవ్ ఎండీ బుర్రాన్, అమీన్‌పూర్ మండలంలోని సుల్తాన్‌పూర్‌కు చెందిన మహ్మద్ ఖలీల్ వెల్డింగ్ పనిచేస్తున్నాడు. హఫీజ్‌పేటకు చెందిన హజార్, మహ్మద్ అలీ ఐటీ ఉద్యోగి వీళ్లంతా స్నేహితులు. అయితే నజీర్, ప్రక్రుద్దీన్ స్నేహితులు. ఈ నేపథ్యంలో ఓ రోజు ప్రక్రుద్దీన్ సోదరి ఎంగేజ్‌మెంట్ జరుగుతుండగా నజీర్ ఆ ఫంక్షన్‌కు వచ్చి నీ చెల్లిపెళ్లి ఆగిపోతుందని అన్నాడు. అయితే అప్పటికే ప్రక్రుద్దీన్ తండ్రి అనారోగ్యం పాలవడం వెనుక నజీర్ చేతబడి చేశాడనే అనుమానం, 15 రోజుల్లో చెల్లిపెళ్లి ఆగిపోవడంతో నజీర్‌పై కోపం పెంచుకున్నాడు. విషయాన్ని తన స్నేహితుడైన బురాన్‌కు చెప్పాడు. బురాన్ గతంలో హత్యకేసుతో పాటు వివిధ కేసుల్లో నేరస్తుడిగా ఉన్నాడు. అయితే ఈనెల 21 రాత్రి ప్రక్రుద్దీన్ నజీర్‌తో మాట్లాడుదామని తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకువచ్చాడు. అంతకుముందే బురాన్, ఖలీమ్, అజార్, అలీతో కలిసి నజీర్ గురించి తమ కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని వివరించి హత్యచేయడానికి పథకం వేశారు. గోపిచెరువుకు రమ్మని అందరు కలిసి మద్యం తాగారు. అనంతరం నజీర్‌తలపై బలంగా కొట్టి, చితకబాదారు. నజీర్ కేకలు వేయడంతో కాలనీవాసులు వచ్చి వారిని మందలించి అతడిని ఆస్పత్రికి తీసుకువెళ్లాలని చెప్పడంతో ప్రక్రుద్దీన్ తన బండిపై నజీర్‌ను కొండాపూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద పడేసి వెళ్లిపోయారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు గుర్తించి చందానగర్ పోలీసులకు సమాచారం అందించారు. నేరం అంగీకరించడంతో ప్రక్రుద్దీన్, బురాన్, ఖలీమ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా అజార్, మహ్మద్ అలీ పరారీలో ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహాశివరాత్రికి ఆలయాల ముస్తాబు



ముస్తాబవుతున్న హుడాకాలనీ, చందానగర్ లోని శివాలయాలు

చందానగర్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినంను శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తారు. ఈ నెల 26న ఉపవాస దీక్ష చేసి మరుసటి రోజు విరమణ చేస్తారు. చందానగర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయం, హుడాకాలనీలోని శివాలయం, వేముకుంట శివాలయం, దర్మపురి క్షేత్రం, లింగంపల్లి శివాలయం, పాపిరెడ్డికాలనీ శివాలయంతోపాటు మాదాపూర్, కొండాపూర్, రాయదుర్గం, మియాపూర్ తదితర ప్రాంతాల్లోని ఆలయాలు ముస్తాబు చేస్తున్నారు.

భెల్‌లో మహోత్సవాలు ప్రారంభం

భెల్‌కాలనీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వారంరోజుల పాటు జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలు భెల్ టౌన్‌షిప్‌లోని యోగేశ్వరస్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. శివాలయంలో సోమవారం ఆలయ ప్రధాన అర్చకుడు వల్లంభట్ల దత్తుశర్మ ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోగల పుట్టమట్టి తీసుకువచ్చి అభిషేకాలను నిర్వహించారు. మహోత్సవాల ఆరంభం సందర్భంగా ఉదయం గణపతి పూజ, ఈశ్వరుడికి పంచామృతాభిషేకం నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామికి విశేష ఫల పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం నిర్వహించారు. ఎంఐజికాలనీలో శివాలయం, రామాలయం, మల్లికార్జునస్వామి ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు.

మరకతలింగం ఆలయంలో త్రయంబిక రుద్రాభిషేకం

సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో లింగంపల్లిలో గల మరకత లింగేశ్వరస్వామి ఆలయంలో త్రయంబక రుద్రపారాయణం నిర్వహించారు. బాబా మందిరం పారాయణం నిర్వహించి భజనలు చేశారు. అనంతనం భక్తులు, సేవా సమితి సభ్యులు లింగంపల్లిలో గల మరగత లింగేశ్వరస్వామి ఆలయంలో మహాలింగానికి అభిషేకం పారాయణం చేశారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరిస్తాం



ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి

హైదర్‌నగర్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజలు వారు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పాపిరెడ్డికాలనీ, గోపినగర్, నెహ్రూనగర్, నేతాజీనగర్, కొండాపూర్ అంజయ్యనగర్, రాఘవేంద్రకాలనీ, ప్రేమ్‌నగర్‌లో దోమల బెడద తీవ్రంగా ఉందని నివారణ చర్యలు తీసుకోవడం లేదని ఫాగింగ్‌సిబ్బంది రావడం లేదని ఫిర్యాదు చేశారు. కొండాపూర్ రాఘవేంద్రకాలనీ, అంజయ్యనగర్, గచ్చిబౌలి టెలికాంనగర్, నల్లగండ్ల హుడాకాలనీలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. లింగంపల్లి పాత గ్రామంలో డ్రైనేజీ కోసం తవ్విన గోతులను పూడ్చాలని కోరారు. ఉప కమిషనర్ ముకుందరెడ్డి మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తామని, అక్రమ నిర్మాణ దారులపట్ల కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.

చందానగర్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): చందానగర్ సర్కిల్-21 కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట్, చందానగర్ డివిజన్ల నుంచి వచ్చి ఫిర్యాదులు అందజేశారు. ఈ కార్యక్రమానికి టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన-3, శానిటేషన్ విభాగం-2, రెవెన్యూ 3 దరఖాస్తులు ప్రజలు అందజేశారని వాటి పరిష్కారానికి సంబంధించి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఉప కమిషనర్ పి.మోహన్‌రెడ్డి తెలిపారు.

అల్కలంబానికి సత్కారం



ఆల్ ఇండియా మహిళా అధ్యక్షురాలు అల్కలంబావి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో శిరీష

గచ్చిబౌలి, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): ఆల్‌ఇండియా మహిళా అధ్యక్షురాలు అల్కలంబానిని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శిరీష కలిసి బొకే అందజేశారు. హైదరాబాద్‌లో జరుగుతున్న రాష్ట్ర మహిళా న్యాయసదస్సులో పాల్గొనడానికి వచ్చిన అల్కలంబానిని కలుసుకోవడం సంతోషంగా ఉందని శిరీష అన్నారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మహిళ నాయకులు పాల్గొన్నారు.

జగదీశ్వర్‌గౌడ్‌కు సన్మానం

గచ్చిబౌలి, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ, మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ ఎంపిక కావడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నల్లగండ్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జగదీశ్వర్ గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సత్కరించారు.

ఎమ్మెల్యే గాంధీని కలిసిన వెల్ఫేర్ అసోసియేషన్

హైదర్‌నగర్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): చందానగర్ శంకర్‌నగర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నుకోబడిన కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు సీనియర్ నాయకుడు రఘునాథ్‌రెడ్డితో కలిసి సోమవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని కలిశారు. అసోసియేషన్‌ను శాలువాలతో ఎమ్మెల్యే సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాలనీ అభివృద్ధి పనులకు రూ.10లక్షలు, సీసీ కెమెరాల కోసం ఎమ్మెల్యే ఎస్‌డీఎఫ్ ఫండ్స్ నుంచి మంజూరి పత్రాలను అసోసియేషన్ ప్రతినిధులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, వర్కింగ్‌ప్రెసిడెంట్ చౌదరి, జనరల్ సెక్రటరీ కృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ చట్టబద్ధతపై హర్షం

గచ్చిబౌలి, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న యాదవులు ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని ప్రభుత్వంకూడా అండగా ఉంటుందని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. కులగణన, 42 శాతం బీసీ రిజర్వేషన్ చట్టబద్ధత చేపడుతున్న తరుణంలో యాదవులు పాల్గొని సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పాల్గొని సీఎం రేవంత్‌రెడ్డిని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

ఈర్ల చెరువును పరిశీలించిన జనసేన నాయకులు

మియాపూర్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): ఈర్ల చెరువులోకి డ్రైనేజీ నీరు చేరడంతో అది మురికికూపంగా మారిందని శేరిలింగంపల్లి జనసేన పార్టీ ఇన్‌చార్జి మాధవరెడ్డి అన్నారు. సోమవారం పార్టీ నాయకులతో కలిసి వారు చెరువును పరిశీలించారు. కనీసం నడవడానికి కూడ వీలులేకుండా ఉందన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని చెరువును సుందరీకరించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాయదుర్గం, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): కోమరంభీమ్ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10నుంచి 1గంట వరకు అంబిక సూపర్‌మార్కెట్, పెద్దమ్మఆలయం, బీఎస్ చౌరస్తా, వెంకటేశ్వరస్వామి టెంపుల్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.

మదీనగూడ పరిధిలో..

మియాపూర్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): మదీనగూడ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మదీనగూడ, కృషినగర్, ఎంఎనగర్, స్టాలిన్‌నగర్ ప్రశాంత్‌నగర్, జనప్రియవెస్ట్‌సిటీ, టీకే ఎన్‌క్లేవ్, లోటస్‌కాలనీ, దత్తసాయి నగర్, అరబిందోకాలనీలో విద్యుత్ ఉండదన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26 నుంచి మార్చి 6వ తేదీ వరకు జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను టీటీడీ ఈవో జె.శ్యామలరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం అంకురార్పణ, బుధవారం ధ్వజారోహణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మార్చి 2న గరుడ వాహనం, 5న రథోత్సవం, 6న చక్రస్నానం నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆలయ ఆవరణలో చలువపందిళ్లు ఏర్పాటుచేసి అందంగా రంగవల్లులు తీర్చిదిద్దాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌తో ప్రతిభావంతులకు ప్రోత్సాహం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ కొలమానంగా అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందని, అర్హులైన ప్రతిభావంతులకు స్కాలర్ షిప్ అందిస్తున్నామని నయంత లీడర్‌షిప్ సభ్యులు ఎయిట్‌రోడ్స్ సంస్థ మాజీ ఫౌండర్ రాజ్ దుగ్గర్ తెలిపారు. టీహబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నయంత ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ రంజన్ బెనర్జీ మాట్లాడుతూ ఏప్రిల్ వరకు దరఖాస్తుల స్వీకరిస్తామని, ఆగస్టు నుంచి పుణేలో ఉన్న తాత్కాలిక యూనివర్సిటీలో తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. వర్సిటీ అడ్మిషన్స్ డీన్ ప్రొఫెసర్ పార్థసారథి మాట్లాడుతూ ప్రతిభావంతులకు అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఉంటుందన్నారు.


ఐఐటీహెచ్‌లో కంప్యూటేషనల్ కెమిస్ట్రీ కేంద్రాన్ని ప్రారంభించిన హైడెల్‌బర్గ్ యూనివర్సిటీ-ఐఐటీహెచ్ అధ్యాపక బృందం

హైదరాబాద్‌ను ఫార్మా హబ్‌గా మారుస్తాం

- టీఐఎఫ్ఆర్ డైరెక్టర్ కృష్ణమూర్తి
- ఐఐటీహెచ్‌తో హైడెల్‌బర్గ్ యూనివర్సిటీ భాగస్వామ్యం

కంది, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌ను ఫార్మా హబ్ గా మార్చి, విద్యార్థులకు ఆధునాతన రసాయన విద్యను అందిస్తామని టీఐఎఫ్ఆర్ (టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంట్ అండ్ రీసెర్చ్) హైదరాబాద్ కేంద్ర డైరెక్టర్ కృష్ణమూర్తి అన్నారు. ఇండో-జర్మన్ సహకారంతో కంప్యూటేషనల్ కెమిస్ట్రీపై పరిశోధనలు జరిపేందుకు సోమవారం సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌తో జర్మనీలోని హైడెల్‌బర్గ్ యూనివర్సిటీ భాగస్వామ్యమైంది. రసాయన పరిశోధన, విద్యా మార్పిడి, ఉపాధి, ఆవిష్కరణలు, సాంకేతికత బదిలీ కోసం ఐఐటీహెచ్‌లో ఐదు రోజుల పాటు ప్రత్యేక వర్క్‌షాప్ హబ్‌ను నిర్వహిస్తున్నారు. ఇందుకోసం హైడెల్‌బర్గ్ విశ్వవిద్యాలయ ఇద్దరు ఉపాధ్యక్షుల నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ప్రతినిధి బృందం ఈనెల 28 వరకు ఐఐటీహెచ్‌లో ఉంటూ ఇక్కడి విద్యా విధానాలు, పరిశోధనలపై అధ్యయనం చేయనున్నారు. ద్వైపాక్షిక- బహుపాక్షిక అకాడెమీ-ఇండస్ట్రీ భాగస్వామ్యాలను ప్రోత్సహించడం హబ్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఐఐటీహెచ్ అధికారులు వెల్లడించారు. ఆధునిక రసాయన శాస్త్రంలో విద్య, శిక్షణ, క్రాస్-కల్చరల్ లెర్నింగ్‌ను ప్రోత్సహించడం, మాస్టర్స్, గ్రాడ్యుయేట్ స్థాయిలలో దీర్ఘకాలిక ఇండో-జర్మన్ మార్పిడి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఒక ముఖ్య చొరవని ఐఐటీహెచ్ డీన్ నరహరిశాస్త్రీ తెలిపారు. రెండు విద్యా సంస్థల మధ్య స్థిరమైన శాస్త్రీయ, సాంకేతిక ఆర్థిక భాగస్వామ్యానికి మార్గం సుగమం చేస్తూ ఈ సహకారాన్ని నడిపించడంలో పరిశ్రమ, ప్రభుత్వ మద్దతు కీలకం ఆయన ఆకాంక్షించారు.

డిజిటల్ అరెస్టు కేసులో తమిళనాడుకు చెందిన ముగ్గురి అరెస్టు

- బాధితుడి నుంచి రూ.1.38 కోట్లు బదిలీ చేయించుకున్న ముఠా

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు పేరుతో డబ్బులు కొల్లగొట్టిన ఓ ముఠా సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు చిక్కింది. ఈ కేసులో ఈ నెల 21న తమిళనాడులోని నమక్కల్‌కు చెందిన గోకుల్ మారుతచాల మూర్తి (24), జాఫర్ షరీఫ్ (23), షారుఖాన్ (30)లను అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సైబర్ క్రైం పోలీసుల వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన బాధితుడికి ముఠాలోని ఒకరు ఫోన్ చేసి తాను ఎస్‌బీఐ ప్రతినిధినని చెప్పి.. మీపై యాంటీ మనీలాండరింగ్ కేసు నమోదైందన్నాడు. అదే సమయంలో వాట్సాప్ కాల్ ద్వారా ఫోన్ చేసి ముంబై క్రైం పోలీస్ ఆఫీసర్‌గా మాట్లాడి ఆయనను తీవ్ర భయాందోళనలకు గురి చేశాడు. బాధితుడి ఆధార్ కార్డును మనీలాండరింగ్ కార్యకలాపాలకు వాడుకున్నట్లు తేలిందని బెదిరించారు. ఈ నేపథ్యంలో బాధితుడు వారికి రూ.1,38,60,000 వివిధ బ్యాంకుల నుంచి బదిలీ చేశాడు. ఆ తర్వాత మోసపోయానని గుర్తించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టారు. బాధితుడు బదిలీ చేసిన నగదులో రూ.9.60లక్షలు గోకుల్ మారుతచాల మూర్తికి చెందిన ఫెడరల్ బ్యాంకు అకౌంట్‌కు వెళ్లినట్టు గుర్తించారు. ఈ డబ్బులను రాహుల్ అనే వ్యక్తి బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసుకున్నాడు. గోకుల్ తన బ్యాంకు అకౌంట్ వివరాలు, పాస్‌బుక్, ఏటీఎం కార్డు, చెక్‌బుక్‌లను జాఫర్ షరీఫ్, షారుఖాన్‌లకు కమీషన్ మీద ఇచ్చాడు. వీరంతా కలిసి ముఠాగా ఏర్పడి బాధితుడి నుంచి డబ్బులు బదిలీ చేయించుకొన్నారు. ముఠా సభ్యులు వాట్సాప్, టెలిగ్రామ్ యాప్‌లను వాడుతూ తాము పోలీసు అధికారులమని చెప్పి మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

రంగారెడ్డి జిల్లా కోర్టు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో వంచించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రంగారెడ్డి 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పీపీ మంజులాదేవి కథనం ప్రకారం.. కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పులిమామిడికి చెందిన తిమ్మగళ్ల శ్రీనాథ్ (21) ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని ఓ బాలికను నమ్మించాడు. మాయమాటలు చెప్పి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత పెళ్లి చేసుకోకుండా తిరస్కరించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదుచేసింది. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండుకు తరలించారు. కేసు పూర్వాపరాలను విచారించిన 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.వాణి నిందితుడు శ్రీనాథ్‌ను దోషిగా నిర్ధారిస్తూ 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేలు జరిమానా విధించారు. బాధితురాలికి రూ.3లక్షల నష్ట పరిహారం చెల్లించాల్సిందిగా తీర్పు వెల్లడించారు.

విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి

- ఎస్సీ ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ వెంకటయ్య

రాంనగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాంచాలని, సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతానిని ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో 'రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15శాతం నిధులు కేటాయించాలని' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్య పరిరక్షణకు ఉద్యమించాలని కోరారు. ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, మనువాద భావజాలాల వల్ల విద్యకు బడ్జెట్ కేటాయింపులో అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఎంవీ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి ఆర్ వెంకట్‌రెడ్డి, బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 15 శాతం నిధులు కేటాయించాలన్నారు. బడ్జెట్ కేవలం 7 శాతం నిధులు కేటాయించి అన్యాయం చేశారన్నారు.

స్కాలర్ షిప్‌ను విడుదల చేయండి

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను విడుదల చేయలని పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు పి. మహేష్ డిమాండ్ చేశారు. సోమవారం మార్క్స్ భవన్‌లో గ్రేటర్ హైదరాబాద్ పీడీఎస్‌యూ కమిటీ సమావేశం జరిగింది.

అస్తవ్యస్తంగా బస్టాప్ ప్రాంగణాలు

బస్టాప్ ప్రాంగణాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఆయా ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టలేదు. కనీస సౌకర్యాలూ లేవు. కొన్ని చోట్ల బస్టాప్ అనే బోర్డులు పెట్టి వదిలేశారు. కనీసం షామియానాలైనా ఏర్పాటు చేయలేదని ప్రయాణికులు వాపోయారు. అసలే ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఈ తరుణంలో వారి కష్టాలు రెట్టింపయ్యాయి.

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో... కొంపల్లి, సుచిత్రా నుంచి కుత్బుల్లా పూర్‌కు వచ్చే చౌరస్తా గోదారిహోమ్స్, ఐడీపీఎల్ చౌరస్తాలో గాంధీనగర్, బస్టాప్ ప్రాంగణాల్లో కూర్చోవడానికి బెంచీలు లేవు. పారిశ్రామిక వాడలోని గాంధీనగర్‌లో బస్టాప్ ప్రాంగణానికి పైకప్పు నిర్మించాలని ఆర్టీసీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్ని సార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. రెండేళ్లయినా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది. అలాగే ఐడీపీఎల్ చౌరస్తాలో బస్టాప్ ప్రాంగణంలో నిలువ నీడ కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఎండదెబ్బకు ప్రయాణికులు చెట్ల కింద కట్టిన గద్దెలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాప్ ప్రాంగణాల అభివృద్ధితోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.


గాంధీనగర్‌లో బస్టాప్ ప్రాంగణం దుస్థితి


బెంచీలు లేక ఓ ప్రాంగణం వద్ద నిలబడిన ప్రయాణికులు

పార్కు స్థలాల్లో ప్రైవేట్ దందా

పార్కు స్థలాల్లో ప్రైవేటు వ్యక్తులు యథేచ్ఛగా దందా నిర్వహిస్తున్నారు. ఇసుక, ఇటుక, కంకర వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఒక ట్రావెల్ కంపెనీ అయితే ఏకంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నది. జగద్గిరిగుట్ట డివిజన్‌లోని ఒక పార్కు తాళం వారి చేతిలో ఉండటం విడ్డూరం. ఆ మేరకు జీహెచ్‌సీఎం అధికారుల శైలిపై విమర్శలు వస్తున్నాయి.


పార్కు స్థలంలో పేర్చిన ఇటుకలు

ఇటుక, ఇసుక వ్యాపార కార్యకలాపాలు

- ట్రావెల్ కార్ల పార్కింగ్‌కూ వినియోగం
- బెల్టుషాపులు, పేకాట కేంద్రాల నిర్వహణ సైతం..
- ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి పార్క్ గేటు తాళం
- పట్టించుకోని జీహెచ్ఎంసీ అధికారులు
- గాజులరామారం డివిజన్‌లో దుస్థితి ఇదీ..



జీడిమెట్ల, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): గాజులరామారం సర్కిల్ జగద్గిరిగుట్ట డివిజన్‌లో ప్రభుత్వ పార్కు కాంపౌండ్ వాల్ వద్ద ప్రైవేటు వ్యక్తులు వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇటీవల నూతనంగా నిర్మించిన పార్కు స్థలంలో సురేష్ అనే వ్యక్తి ఇటుక, ఇసుక, కంకర వ్యాపారం యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఈపార్కు స్థలం తాళాలు కూడా తన ఆధీనంలోనే ఉన్నాయి. ఇక్కడే ఉన్న పెద్దబండరాళ్లను సైతం పగులగొట్టి కంకర తయారు చేయిస్తున్నాడు. ఈ విషయమై రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. వార్డు కార్యాలయం పక్కనున్న స్థలాన్ని కూడా కబ్జాచేసి ఓ దేవతామూర్తి మండపం పేరుతో నడిరోడ్డుపై షెడ్డు నిర్మించారు. ఇక్కడే ఇటుకల వ్యాపారం సాగిస్తున్నారు.

- రాజీవ్‌గృహకల్ప ప్రాంతంలోని పార్కులను కబ్జా చేసి కొందరు ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు కారు పార్కింగ్ కేంద్రాలుగా మార్చుకుంటున్నారు. ఈ స్థలాన్ని కబ్జా చేసి చుట్టూ వ్యాపార కేంద్రాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా కబ్జాలు చేస్తూ డబ్బాలు ఏర్పాటు చేసి బెల్టుషాపుల, పేకాట కేంద్రాలుగా మార్చుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు సిబ్బంది పట్టించుకోకపోవడంతో ప్రజాప్రయోజనాల కోసం వదిలిన ప్రభుత్వ స్థలాలు కబ్జాల పాలవుతున్నాయి. జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఈ దుశ్చర్యలు సాగుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గాజులరామారం జీహెచ్ఎంసీ అధికారులు, రెవెన్యూ అధికారులు స్పందించి తక్షణమే ప్రభుత్వ స్థలంలో సాగుతున్న అక్రమ వ్యాపారాలను అరికట్టి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



ప్రజాప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన పార్కు స్థలాలను ఇష్టానుసారంగా తమ ఆధీనంలోకి తెచ్చుకుని వ్యాపార కేంద్రాలుగా మార్చుకుంటామంటే చూస్తూ ఊరుకోం. ఇటీవల నిర్మించిన కాంపౌండ్‌వాల్ ఆవరణలో గతంలో కొందరు ఇటుక, ఇసుక వ్యాపారం చేసుకుంటున్నారు. వారిని అక్కడ నుంచి తీసివేయాలని గతంలోనే తెలిపాం. ఇప్పటికీ తీయకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం. పార్కులలో అక్రమ పార్కింగ్‌లు చేసే వారిపైనా కేసులు నమోదు చేస్తాం.

మల్లారెడ్డి, గాజులరామారం,
డిప్యూటీ కమిషనర్

పైపులైన్ వేయాలి

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మంచి నీటి సమస్య తీవ్ర తరంగా ఉందని, మహేంద్రానగర్‌లో మంచి నీటి పైప్‌లైన్ వేయాలని న్యూ వివేకానంద కాలనీ, సాయి నగర్ తదితర ప్రాంతాల్లోని కాలనీ వాసులు కోరుతున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్‌లోని ఆదర్శనగర్, కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో వినతి పత్రాన్ని అందజేశారు. తాగునీటి సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని, సాంకేతిక లోపంతో జరిగిన సమస్యతో కాలనీలో కొంత నీటి కొరత ఏర్పడుతుందని జలమండలి జీఎం తెలిపారు. రెండు రోజుల్లో తాగునీరు ఎప్పటి మాదిరిగానే అందుతుందన్నారు.

'ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి'

దుండిగల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలం కబ్జా చేసిన ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అండ దండలతో పేట్ బషీరాబాద్ ప్రభుత్వ భూమి సర్వేనంబరు 23లో 1200 గజాల స్థలాన్ని ఆక్రమించి, ఎకరం పైగా ఉన్న భూమిని అప్రోచ్ రోడ్డుగా చూపించిన బడా కన్‌స్ట్రక్షన్‌పై సోమవారం మేడ్చల్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు ఇచ్చారు. సర్వేనంబరులో 5.25 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఇప్పటికే కొంత భూమిలో ప్రైవేట్ స్కూల్, ఎన్‌సీఎల్ కాలనీ పార్కుతో పాటు కొన్ని నిర్మాణాలు కూడా వెలిశాయన్నారు. దొరికిందే సందు అన్నట్లుగా ఒక ఆస్పత్రి వారు అప్పటికే తమ నిర్మాణాలు సైతం పూర్తి చేసుకున్నారన్నారు. మైసా కడల్ కన్‌స్ట్రక్షన్ వారు సర్వే నంబరు 12,24లో ప్రైవేట్ భూమిని చూపిస్తూ, పక్కనున్న ప్రభుత్వ భూమి సర్వేనంబరు 23లో కొంత ఆక్రమించుకొని, సర్వేనంబరు 24లో చూపించారన్నారు. ఆ మేరకు ఆక్రమణలపై విచారణ జరిపించాలని ఫిర్యాదులో కోరారు.

ప్రతీ రైతుకు న్యాయం చేస్తాం

- ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే పోరాడుదాం
- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దుండిగల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఏ రైతుకు అన్యాయం జరగకుండా కాపాడుకుంటామని, వారి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. దుండిగల్ గ్రామ పరిధిలోని సర్వేనంబరు 53,54లోని చిన్నచెలక భూమిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోర్డులతో రైతులు తీవ్ర గందరగోళానికి గురైన విషయం తెలుసుకున్న ఆయన సోమవారం గ్రామ వార్డు కార్యాలయంలో వారు ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు సాగు చేసుకునే భూమిలో ప్రభుత్వం బోర్డులు ఏర్పాటు చేయడంపై అధికారులతో చర్చిస్తామన్నారు. ఈ విషయంలో ఏ ఒక్కరికీ కూడా అన్యాయం జరగదని భరోసా ఇచ్చారు. 50 ఏళ్ల క్రితం నిరుపేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని చూస్తోందని ఈ సందర్భంగా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో సర్కారు సానుకూలంగా స్పందించకుంటే చట్టపరంగా పోరాడుదామని అన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

తహసీల్దార్‌తో చర్చ

ఈ విషయమై దుండిగల్ తహసీల్దార్ మతిన్‌తో రైతులు , నాయకులతో కలిసి ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేసిప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, మాజీ కౌన్సిలర్లు కృష్ణయాదవ్, గోపాల్‌రెడ్డి, శంభీపూర్ కృష్ణ, మాజీ సర్పంచ్ కావలి గణేష్, జక్కుల విజయ్, మైనార్టీ రైతులు, గ్రామం రైతులు ఉన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

ప్రజాసేవకే నా జీవితం అంకితం

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రతిక్షణం ప్రజాసేవ కోసం పాటుపడతానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. పలువురు నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గం ప్రజలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్‌నగర్‌లో ఉన్న ఆయనను తన నివాసంలో కలిశారు. వారిని స్థానిక సమస్యల గురించి అడిగి తెలుసుకొన్నారు. వారిచ్చిన ఆహ్వానాలు స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా కూన మాట్లాడుతూ ప్రతిక్షణం ప్రజల సమస్యల పరిష్కారం దిశగా పనిచేస్తానన్నారు. నిరంతరం నియోజకవర్గం అభివృద్ధి కోసం పని చేస్తానన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం ప్రజలు, నాయకులు, సంక్షేమసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఫిర్యాదు

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) :కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలో సోమవారం జరిగిన ప్రజావాణిలో పలు సమస్యలు పరిష్కరించాలని ప్రజలు ఫిర్యాదు చేసినట్లు ఉప కమిషనర్లు నర్సింహ, మల్లారెడ్డిలు తెలిపారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో ఇంజినీరింగ్ విభాగానికి 3, టౌన్ ప్లానింగ్ విభాగానికి 3, పన్నుల శాఖకు 2 దరఖాస్తులు వచ్చాయన్నారు. గాజులరామారం సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్‌కు 6, ఇంజినీరింగ్‌కు 1 దరఖాస్తు వచ్చిందన్నారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సాధ్యమైనంత త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఉప కమిషనర్లు తెలిపారు.

కార్మికులకు అండగా ఉంటాం

శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కంపెనీల్లోని కార్మికులకు ఎటువంటి సమస్యలు వచ్చినా అండగా నిలబడి న్యాయం చేస్తానని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి సింగ్ అన్నారు. సోమవారం షాపూర్‌నగర్‌లోని తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం ఇండస్ట్రియల్ ఏరియాలో భాషఖాన్ ఫ్యాబ్రికేషన్‌లో ప్రవీణ్ అనే కార్మికుడు కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నాడన్నారు. కొన్ని అనివార్య కారణాల వల్ల అతను డ్యూటీకి రాలేకపోయాడు. దీంతో ఓనర్ వేతనం ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడంతో తమను కలిసి న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. తక్షణమే స్పందించి యజమానితో పలుమార్లు చర్చించి వేతనం రూ.25 వేలు ఇప్పించామన్నారు. ఈమేరకు రవిసింగ్‌కు ప్రవీణ్ ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్‌లు తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న సాయి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు

అన్ని దానాలకన్నా అన్నదానమే గొప్పది

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అన్ని దానాల కన్నా అన్నదానమే గొప్పదని సాయి గణేష్ ఉత్సవ కమిటీ సీనియర్ సభ్యులు మోతె రాజేశ్వర్, జింకల వెంకటేష్‌ముదిరాజ్‌లు అన్నారు. సోమవారం రంగారెడ్డినగర్ డివిజన్‌లోని పంచశీల కాలనీలో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు టి. భాషయ్య, వెంకట సూర్యనారాయణ ఆర్. రామకృష్ణ, సంజీవ్‌కుమార్, స్థానికులు పాల్గొన్నారు.



ఆలయ వార్షికోత్సవం.. ఎస్ఐ పూజలు

గాజులరామారం డివిజన్ బాలయ్యనగర్‌లోని శ్రీరేణుకాఎల్లమ్మ దేవాలయం 21వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సత్యం తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

-గాజులరామారం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి)



మొక్కలు నాటే కార్యక్రమం

బాచుపల్లి కౌశల్య కాలనీలో శ్రీ వేంకటశివరామాలయ దేవాలయ ప్రాంగణంలో కాలనీ వాసులతో కలిసి ఆలయ కమిటీ సభ్యులు మొక్కలు నాటారు. ఆపై ఆలయ ధర్మకర్త, 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆగం రాజు.. నీళ్లు పోశారు.

నిజాంపేట్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి):

వైభవంగా ఘటాభిషేకం



మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సూరారం ఉమామహేశ్వర ఆలయంలో సోమవారం శాస్త్ర ఘటాభిషేకం నిర్వహించారు. 108 కలశాల మధ్య శంకు పూజను దేవాలయ ధర్మకర్త ముద్దాపురం మదన్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. పూజల్లో వీరేశం,అత్తయ్య, అశోక్, భక్తులు పాల్గొన్నారు.

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి)